ఈనాడు
epaper.eenadu.net

# పాతబస్తీ మెట్రో భూసేకరణలో కీలకఘట్టం

- ఆస్తులు కోల్పోతున్న యజమానులకు నేడు చెక్కుల పంపిణీ



ఈనాడు, హైదరాబాద్: పాతబస్తీ మెట్రో రైలు పనుల ప్రారంభానికి మార్గం సుగమం అవుతోంది. రహదారి విస్తరణలో ఆస్తులు కోల్పోతున్న యజమానులకు పరిహారం పంపిణీకి ప్రభుత్వం ముహూర్తం ఖరారుచేసింది. చెక్కులపంపిణీ సోమవారం ప్రారంభం కానుంది. మెట్రో రెండో దశలోని కారిడార్-6ను ఎంజీబీఎస్-చంద్రయాణగుట్ట వరకు నిర్మించనున్నారు. మొదటి దశలోనే పూర్తి చేయాల్సి ఉండగా.. ఆస్తుల సేకరణ, అలైన్‌మెంట్ వివాదాలతో పదేళ్లుగా నిలిచిపోయింది. దీంతో రెండో దశలో చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అవసరమైన రైట్ ఆఫ్ వే కోసం ముందుగా రహదారులు విస్తరించాలి. సర్వే చేపట్టగా 1100 ఆస్తులను సేకరించాల్సిఉంటుందని అధికారులు తేల్చారు. ఇందుకు సంబంధించి భూసేకరణ నోటిఫికేషన్లు విడతలవారీగా జారీ చేశారు. చదరపు గజానికి రూ.81 వేలుగా పరిహారం ఇవ్వడానికి హైదరాబాద్ జిల్లా కలెక్టర్ నిర్ణయించారు.

**169మంది సమ్మతి:** లక్డీకాపూల్‌లోని మధ్యాహ్నం 2 గంటలకు పరిహారం చెక్కుల పంపిణీ జరుగుతుందని హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైలు లిమిటెడ్(హెచ్ఏఎంఎల్) ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. ఇప్పటివరకు 169 మంది సమ్మతి తెలుపుతూ పత్రాలిచ్చారని వెల్లడించారు. తొలుత 40మందికి చెక్కులు పంపిణీ చేస్తారన్నారు. హైదరాబాద్ ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి హాజరవుతారని వివరించారు. సీఎం ఆదేశాలతో త్వరితగతిన మెట్రో పనులు చేపట్టేలా సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు.

Date : 06/01/2025 EditionName : GREATER HYDERABAD
PageNo :